క్లుప్తంగా

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు రమేష్, చిట్టెం వాసు, నగేష్, చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి అర్చకుడు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలోనూ పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

108 వాహనంలో ప్రసవం



108 వాహనంలో జన్మించిన బిడ్డను చూపుతున్న సిబ్బంది

గండేపల్లి: మండలంలోని ఎన్టీ రాజాపురానికి చెందిన గర్భిణి 108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఎన్టీ రాజాపురానికి చెందిన గర్భిణి దేవికి పురిటి నొప్పులు ప్రారంభం కావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 వాహన సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళుతుండగా గండేపల్లి వద్దకు వచ్చేసరికి నొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 అంబులెన్స్ సిబ్బంది జి.వరప్రసాద్, పైలెట్ నాని కుటుంబ సభ్యుల సాయంతో ఆమెకు పురుడు పోశారు. దేవి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డా క్షేమంగా ఉన్నారని, రాజమహేంద్రవరం ప్రభుత్వ హాస్పటల్‌కి తరలించినట్టు తెలిపారు.

తలసేమియా రోగికి అరుదైన శస్త్ర చికిత్స

తుని: తలసేమియా వ్యాధిలో బాధపడుతున్న బాలుడికి తుని మమతా ఆసుపత్రిలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్టు ఆసుపత్రి సీఈవో వికాస్ తెలిపారు. తొండంగి మండలానికి చెందిన సాల్మన్‌రాజు అనే బాలుడు తల సేమియా వ్యాధితో ఆసుపత్రిలో చేరగా అతని శస్త్రచికిత్స చేశారు. స్థానిక రెడ్ కాన్వెంట్ వీధిలోని ఆసుపత్రిలో శుక్రవారం డాక్టర్ సయ్యద్ నౌషద్ పూర్తి వివరాలను వెల్లడించారు. కణాల్లో మార్పులతో కడుపులో 120 గ్రాముల ఉండే కణం 2.30 కిలోలకు చేరిందని, బాలుడు రక్తహీనతతో ఉండగా అనుభజ్ఞులైన వైద్యులతో కలిసి విజయవంతగా శస్త్రచికిత్స చేసి తొలగించామన్నారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు. పలువురు వైద్యులు పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై ఎస్ఈబీ దాడులు

తుని: తొండంగి మండలంలోని సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. తొండంగి పోలీసుల సహకారంతో వేమవరంలో 25 డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో 20 ఖాళీ డ్రమ్ములు ఉండగా మిగిలిన డ్రమ్ముల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 4000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని రామవరం శివారులో సారా తయారీ కేంద్రాలపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తోట వీరన్నను అరెస్టు చేసి అతని నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

కేఓ అగ్రహారంలో 'మీ ఇంటికి మీ దివ్య'

కోటనందూరు: మండలంలోని కేఓ అగ్రహారంలో శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో 'మీ ఇంటికి మీ దివ్య' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ తుని నియోజకవర్గ ఇన్‌చార్జ్ యనమల దివ్య ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు విడుదల చేసిన ఎన్నికల మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ సీనియర్ నాయకులు యనమల కృష్ణుడు, గాడి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మురిపింఛన్



నాడు: అల్లిపూడిలో పంచాయతీ కార్యాలయం వద్ద పింఛను కోసం వేచి ఉన్న వృద్ధులు



నేడు: పాతకొట్టాంలో దివ్యాంగుడికి ఇంటి వద్దే పింఛను అందిస్తున్న గ్రామ వలంటీర్

- ప్రతినెలా 1న ఠంచన్‌గా అందుతున్న పెన్షన్
- ఇంటి వద్దే అందజేస్తున్న వలంటీర్లు
- అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

కోటనందూరు: గత ప్రభుత్వంలో సామాజిక పింఛను అందుకోవడం లబ్ధిదారులకు గగనంగా ఉండేది. కర్ర సాయంతో వృద్ధులు, కాళ్లు ఈడ్చుకుంటూ దివ్యాంగులు, తీవ్ర ఆవేదనతో అనారోగ్యం బారిన పడినవారు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి రోజంతా వేచి ఉండాల్సిన దయనీయ పరిస్థితి ఉండేది. అధికారులు ఇచ్చినప్పుడు తీసుకోకపోతే మళ్లీ పింఛను అందుతుందో, లేదో తెలియని దుస్థితి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సామాజిక పింఛన్ల పంపిణీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారులను మురిపించారు. ప్రతినెలా ఒకటో తేదీన వేకువజామునే ఇంటి ముంగిటే పింఛను అందజేస్తున్నారు. గతంలో రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితుల్లో అర్హత ఉన్నా..అన్ని వర్గాలవారు పింఛను తీసుకునే పరిస్థితి ఉండేది కాదు. ఇప్పుడు ఇంటి వద్దే పింఛను అందుతుండడంతో కుల, మత, వర్గ, పేద, ధనిక బేధం లేకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుకుంటున్నారు.

7689 మంది లబ్ధిదారులకు..

కోటనందూరు మండలంలో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 6,173 మంది లబ్ధిదారులకు రూ. 1.47 కోట్లు పింఛను వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వంలో మండలంలో 7689 మంది లబ్ధిదారులకు రూ. 2.11 కోట్ల పింఛను అందుతోంది.

క్రమ సంఖ్య	గ్రామం పేరు	2019లో లబ్ధిదారులు	పింఛను మొత్తం (రూ.లక్షల్లో)	2023 లబ్ధిదారులు	పింఛను మొత్తం (రూ.లక్షల్లో)
1	అల్లిపూడి	670	15.86	881	22.8
2	భీమవరపుకోట	306	7.26	401	11.1
3	బిళ్లనందూరు	348	8.2	397	10.8
4	బొద్దవరం	490	11.6	616	16.8
5	ఇండుగపల్లి	354	8.3	448	12.0
6	జగన్నాధపురం	358	8.1	431	11.5
7	కేఈ చిన్నయ్యపాలెం	540	13.3	711	19.8
8	కొత్తకొట్టాం	401	12.2	611	16.9
9	కాకరాపల్లి	258	6.1	333	9.0
10	కేఏ మల్లవరం	562	13.5	673	18.7
11	కోటనందూరు	723	17.8	882	24.8
12	పాతకొట్టాం	564	13.5	679	19.2
13	ఎస్సార్‌పేట	499	11.7	658	17.9
		6173	147.3	7689	211.09

జగన్ గొప్ప మనసును చాటారు



కోటనందూరు మండలం టీజేనగరం గ్రామానికి చెందిన సుర్ల లింగయ్య వృద్ధాప్య పింఛను లబ్ధిదారు. గతంలో పింఛను పొందాలంటే ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేదని చెబుతున్నాడు. పింఛను ఇచ్చే అధికారి ఎప్పుడు వస్తాడో తెలియక కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సి వచ్చేదంటున్నాడు. జగన్ సీఎం అయిన తరువాత వృద్ధుల కష్టాలు తీర్చారని, ఆయన పెద్ద మనసుకు జోహార్లని లింగయ్య ఆనందం వెలుబుచ్చుతున్నాడు.

– సుర్ల లింగయ్య, టీజే నగరం

తెల్లవారుజామునే తలుపుతట్టి..



కోటనందూరు మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన మాతిరెడ్డి యర్రయ్యమ్మ వృద్ధాప్య పింఛను లబ్ధిదారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛను తీసుకోవాలంటే నాలుగైదు రోజుల సమయం పట్టేది. ఎప్పుడు పింఛను అందుతుందో గ్యారంటీ ఉండేది కాదు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారక ముందే తలుపుతట్టి వలంటీరు పింఛను ఇస్తున్నాడని యర్రయ్యమ్మ చెబుతోంది. ఇంటి వద్దకే పింఛను అందించడం గొప్ప విషయమని ఆనందం వ్యక్తం చేస్తోంది.

– మాతిరెడ్డి యర్రయ్యమ్మ, జగన్నాథపురం

ఇంటికే తెచ్చి ఇస్తున్నారు



కోటనందూరు సింహాద్రి కాలనీకి చెందిన చప్పా వెంకటలక్ష్మి వితంతువు. ఈమె భర్త 10 ఏళ్ల క్రితం మరణించారు. కూలి పనులే ఈమెకు జీవనాధారం. టీడీపీ హయాంలో ఇచ్చే రూ.వెయ్యి పింఛను కోసం రెండు, మూడు రోజులు పనులు మానుకొని ఆఫీసు వద్ద పడిగాపులు కాసేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వేకువజామునే పింఛను అందుకుని పనులకు వెళ్లిపోతున్నానని సంతోషంగా చెబుతోంది.

– చప్పా వెంకటలక్ష్మి, కోటనందూరు

కష్టాలు తీరాయి



దివ్యాంగుడైన కుంచే సబ్రమణ్యానిది కోటనందూరు మండలం ఇండుగపల్లి. చంద్రబాబు హయాంలో పింఛను తీసుకోడానికి కాలు కుంటుకుంటూ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పడికాపులు కాసేవాడు. పేరు పిలిచే వరకూ నీళ్లు, ఆహారం లేకుండా అక్కడే పడి ఉండేవాడు. సీఎం జగన్ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఇంటి వద్దే పింఛను తీసుకుంటున్నానని, కష్టాలు తీరాయని రెట్టించిన ఉత్సాహంతో చెబుతున్నాడు సుబ్రహ్మణ్యం.

– కుంచే సుబ్రహ్మణ్యం, ఇండుగపల్లి

జగన్ పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ప్రత్తిపాడులో గడపగడపకూ మన ప్రభుత్వం



ప్రత్తిపాడులో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచందప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: సంక్షేమ పాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన ప్రత్తిపాడులో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, ఎంపీటీసీ పినిశెట్టి అమృతవర్షిణి, సీంద్రిపు భాస్కరరావు తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను అధికారుల సమక్షంలో పరిష్కరించారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉన్నాయన్నారు. అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ గోళ్ల శేఖర్‌బాబు, సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్, పార్టీ నాయకులు పినిశెట్టి ప్రకాష్, ఆకుల వీరబాబు, చలంకూరి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు విధిగా పాటించాలి

జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ



తామరాడలో చేపల చెరువులను పరిశీలిస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ, సిబ్బంది

కిర్లంపూడి: చేపలు చెరువుల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ సత్యనారాయణ సూచించారు. మండలంలోని తామరాడ, వీరవరం, గోనేడ, ఎస్.తిమ్మాపురం చేపల చెరువులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిర్లంపూడి మండలంలోని పలు గ్రామాల్లోని చేపల చెరువుల్లో కుళ్లిన కోడి వ్యర్థాలు ఉపయోగిస్తున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మత్స్యశాఖ, పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించగా పలు చోట్ల కోడి వ్యర్థాలు వాడినట్లు గుర్తించామన్నారు. సంబంధిత చెరువుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామన్నారు. మరోసారి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కోడి వ్యర్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అడిషనల్ అధికారి లావణ్య, ఏఐఎఫ్ బి.రాజేంద్రరావు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం



తుని సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బొప్పన రాము



ఏలేశ్వరంలో రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

తుని: ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ బొప్పన రాము అన్నారు. తుని వ్యవసాయ మార్కెట్ యార్డులోని కార్యాలయంలో శుక్రవారం ఏడీఏ ఎస్.బులిబాబు అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాము మాట్లాడుతూ రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకంలో తొలి విడతగా రూ.5500 జమచేశారన్నారు. తుని నియోజకవర్గంలో 13,286 మందిని లబ్ధిదారులుగా గుర్తించామన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో సీహెచ్‌సీ గ్రూపులకు ట్రాక్టర్లు 9, రోటా వేటర్లు 11, పవర్ స్ప్రేయర్ ఒకటి అందించామని చెప్పారు. రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట, జనుము విత్తనాలు అందిస్తున్నట్టు చెప్పారు. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు చోడ్రాజు రాంబాబు రాజు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు సాగును ప్రోత్సహించాలి

కోటనందూరు: ఖరీఫ్‌లో ముందస్తు సాగును ప్రోత్సహించాలని మండల వ్యవసాయాధికారి కె. చంద్రశేఖర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన ఏఏబీ మండలస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ సాగు ఆలస్యమైతే చివరికాలో పంట తుపానుల బారిన పడే ప్రమాదం ఉన్నందున రైతులు ముందుగానే ఖరీఫ్ సాగు ప్రారంభించేలా ప్రోత్సహించాలన్నారు. ఇప్పటికే రైతుల అవసరాలకు అనుగుణంగా వరి విత్తనాలు ఆర్బీకేలకు చేరాయన్నారు. ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్యవసాయ సిబ్బంది పక్కా ప్రణాళికతో ఖరీఫ్ సీజన్‌ను అధిగమించాలన్నారు. తుని మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగా వెంకటకృష్ణాజీ, ఏఏబీ మండలాధ్యక్షుడు సుర్ల రాజు, ఏఈఓ కేవీ శివకుమారి , వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఏలేశ్వరం: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏఓ జ్యోతి అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. అనంతరం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, ఎంపీటీసీ సభ్యులు ఇజనగిరి ప్రసాద్, వడ్డి శ్రీవాస్తవ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



ఎంపీడీఓ వెంకటాచలాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్, ప్రజా ప్రతినిధులు

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఆదేశించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సమస్యలను గుర్తించి అధికారుల దృష్టి తీసుకువెళ్లి పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం పదోన్నతిపై కాట్రేనికోన ఎంపీడీఓగా బదిలీ అయిన ఎస్.వెంకటాచలాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ ఎస్వీ చలం, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ కె.సత్యనారాయణ మూర్తి, ఈఓపీఆర్డీ కేఎస్ఎస్ కాశీవిశ్వనాథ్, సీనియర్ అసిస్టెంట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కోటనందూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు శుక్రవారం వైద్య సేవలు అందించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. ఇందిరా ప్రియదర్శిని 87 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై గర్భిణులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ లగుడు శ్రీనివాసు మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో ఎటువంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఎంపీహెచ్‌ఏ పి.అప్పలనాయుడు ఆర్థిక సహాయంతో మధ్యాహ్నం గర్భిణులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కొరుప్రోలు కృష్ణ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

గోకవరంలో 44 మందికి..

గోకవరం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా డాక్టర్ వనజా 44 మంది గర్భిణులకు రక్త పరీక్షలతో పాటు 16 మందికి స్కానింగ్ పరీక్షలు చేశారు. వైద్య పరీక్షలకు హాజరైన గర్భిణులకు ఎలుకల దిబ్బలో పాస్టర్ డేవిడ్ పాల్ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ రాయుడు, పీహెచ్‌ఎన్ భారతి, హెచ్‌వీ సుజతా, హెల్త్ అసిస్టెంట్లు పవన్, రమణ, ఝాన్సీ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం మండలంలో 48 మందికి..

శంఖవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజన కార్యక్రమంలో భాగంగా 23 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు, పౌష్టికాహారం అందించినట్టు పీహెచ్‌సీ డాక్టర్ ఆర్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. పి.మల్లాపురం పీహెచ్‌సీలో 25 మంది గర్భిణులకు పరీక్షలు చేసినట్టు పీహెచ్‌సీ డాక్టర్ సందీప్ తెలిపారు.

బాల్య వివాహంపై విచారణ

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో 14 ఏళ్ల మైనర్ బాలిక మొల్లు ఐశ్వర్యకు బాల్య వివాహం జరిపించినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీస్ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన మొల్లు ఐశ్వర్య తల్లిదండ్రులు మొల్లు కొండలరావు, రత్నం అన్నవరం దేవస్థానం ఆవరణలో వివాహం జరిపించినట్లు విచారణలో వెల్లడైందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ఐసీడీఎస్, రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ప్రభాకర్ తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

కిర్లంపూడి: జగపతినగరం గ్రామ శివారులో పేకాడ శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై టి.రఘునాథరావు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... ప్రత్తిపాడు సబ్‌స్టేషన్ వెనుక ఉన్న పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.15100 స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ సిబ్బంది గణేశ్, శివ, హోంగార్డ్స్ మూర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలి



గోకవరంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కర్నాకుల వీరాంజనేయులు

గోకవరం: మండలంలోని కామరాజుపేట పంచాయతీ శివరామపట్నంలో పేదలు సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక దేవిచౌక్ వరకూ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ వి.శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ శివరామపట్నంలో 36/2ఏ, 34/1, 35/2, 4/1 సర్వే నంబర్లలో గల 36 ఎకరాల సీలింగ్ భూమిని 70 నిరుపేద కుటుంబాలు 20 ఏళ్లుగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయన్నారు. వీరికి పట్టాలు మంజూరు చేయాలంటూ గ్రామస్థాయి నంచి జిల్లా స్థాయి వరకూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి అధికారులకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. ఈ భూములను కొందరు రాజకీయ నాయకులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.రమేష్, కె.సతీష్, శ్రీకాంత్, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణానికి స్థల పరిశీలన



జె.అన్నవరంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు శుక్రవారం పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు స్థల పరిశీలన చేశారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ చొరవతో జె.అన్నవరం గ్రామానికి ప్రభుత్వం పీహెచ్‌సీని మంజూరు చేసింది. గ్రామంలోని మూడు ఎకరాల భూమిని ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ నిర్మాణం నిమిత్తం స్థలాన్ని పరిశీలించామని, ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని చెప్పారు. తహసీల్దార్ చిన్నారావు, వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, కొండపల్లి వెంకటేశ్వరరావు, కాలారి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.